క్లుప్తంగా

సునీల్‌కుమార్‌కు ఉత్తమ సేవా పురస్కారం



అవార్డు అందుకుంటున్న బీపీఎం సునీల్‌కుమార్

రౌతులపూడి: స్థానిక పోస్టల్ బీపీఎం కొత్త సునీల్‌కుమార్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. కాకినాడ డివిజన్ పోస్టల్ శాఖలో గత ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ శాతం వ్యాపారులకు యూపీఐ సేవలు అందించినందుకు గాను ఆయనకు ఈ అవార్డు వచ్చింది. బుధవారం కాకినాడ పోస్టల్ డివిజనల్ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు సీనియర్ మేనేజర్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా సునీల్‌కుమార్ అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీత సునీల్‌కుమార్‌ను ఎస్‌పీఎం అప్పారావు, పోస్టల్ అసిస్టెంట్ తేజ, ఎస్.పైడిపాల పోస్టు మాస్టర్ కె.రాజబాబు అభినందించారు.

గోదాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకాలు



ఎస్.అన్నవరంలో గోదాదేవికి పంచామృతాభిషేకాలు చేస్తున్న అర్చకుడు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదాదేవి అమ్మవారికి బుధవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి తిరునక్షత్రం 'పుబ్బ' సందర్భంగా నవ కలశాల్లో పంచామృతాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి అభిషేకించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారికి దీపాలంకర సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కుమ్మరిలోవ తపోవనం సందర్శన



తపోవనంలో సరస్వతీ మహాస్వామి ఆశీస్సులు పొందుతున్న రమేష్‌బాబు

తుని రూరల్: అన్నవరం వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం ఇన్‌చార్జ్ ఈఓగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు బుధవారం తుని మండలం కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమంలో రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉచిత వైద్య శిబిరం



తునిలో వాకర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

తుని: స్థానిక గణపతినగర్ పార్కు వద్ద సిటీ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్లు 75 మంది వాకర్లకు బీపీ, సుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం వాకర్లకు ఔషధ గుణాలు కలిగిన తమలపాకు, తేనే, వెల్లుల్లి, అల్లంతో తయారు చేసిన కిళ్లీలు అందజేసినట్టు క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ సోమేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎస్‌వీజీ రాజు, ఎల్.అప్పారావు , బి.సత్యనారాయణ, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని కలిగి ఉండాలి

గండేపల్లి: విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని కలిగి ఉండాలని ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్ ఎన్.శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి సూచించారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభం కార్యక్రమంలో వారు మాట్లాడారు. మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం సాధించడమే విద్యార్థుల లక్ష్యం అయితే బీటెక్ పట్టాతో పాటు మంచి వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగ నియామక పత్రం అందిస్తామన్నారు. యూనివర్సిటీలో విద్యార్థులకు మంచి విద్యతో పాటు ఉద్యోగ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం షిర్డీనగర్‌లో చెరువును తలపిస్తున్న రహదారి



ఏలేశ్వరం మొక్కరేవులకాలనీలో రహదారిపై నిల్వ ఉన్న నీరు



ప్రత్తిపాడు నీట మునిగిన వీధి రోడ్డు

హోరు వాన

- మెట్టలో విస్తారంగా వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పెదశంకర్లపూడిలో ఎర్ర కాలువకు గండి

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో బుధవారం నియోజకవర్గవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం పడుతూనే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బయటకు వచ్చేందుకు వీలు లేకపోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పల్లపు ప్రాంతాల్లో రహదారులు నీటమునిగాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వర్షపునీరు నిల్వ ఉండిపోయింది. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం బురదమయంగా మారింది. మండలంలోని లింగంపర్తి, జె.అన్నవరం, మర్రివీడు, తూర్పు లక్ష్మీపురం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు పడటంతో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వరినాట్లు, సాగు పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

కాలువకు గండి.. ముంపులో పొలాలు

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి గ్రామంలో ఎర్రకాలువకు బుధవారం సాయంత్రం గండి పడింది. నాగులకొండ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు ఎర్రకాలువ ద్వారా పెదశంకర్లపూడి వెంకన్నదొర చెరువు నుంచి పల్లపు ప్రాంతాలకు ప్రవహిస్తోంది. లంపకలోవ – పెదశంకర్లపూడి గ్రామాల మధ్య ఆర్ అండ్ బీ రోడ్డును అనుకుని ఈ కాలువ ప్రవహిస్తుంది. గతంలో ఈ రోడ్డుకు ఇరువైపులా ఉండే కాలువల ద్వారా నీరు ప్రవహించేది. కాలక్రమేనా ఒక వైపు కాలువ ఆక్రమణలకు గురికావడంతో ఈ ఎర్రకాలువపై వర్షం కురిసిన ప్రతీసారి నీటి ఉధృతి పెరిగి కాలువకు గండ్లు పడడం సర్వసాధారణంగా మారింది. మరో వైపు మండలంలో గోకవరం నుంచి సుబ్బారెడ్డిసాగర్ ప్రాజెక్టులోకి ఏటి కాలువ ద్వారా వచ్చే జలాలు కూడా ఈ కాలువలో కలుస్తాయి. కొండలు, సుబ్బారెడ్డి ప్రాజెక్టు నుంచి ప్రవహించే నీటి ఉధృతికి లంపకలోవ – పెదశంకర్లపూడి గ్రామాల మధ్య ఎర్రకాలువకు సుమారు ఆరు మీటర్ల మేర గండి పడింది. ఈ గండి వల్ల సుమారు 60 ఎకరాల పంట పొలాలు నీటమునిగాయి. నీరు తగ్గిన తర్వాత పంట పొలాలల్లో బురద పేరుకుపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత వారం రోజులుగా మండలంలో అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వర్షాలకు గ్రామాల్లో వీధులన్నీ చిత్తడిగా మారాయి. ప్రత్తిపాడులో మంగళవారం 34.4 మిల్లీ మీటర్లు, బుధవారం 6.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రత్తిపాడులో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డు బాట పడుతోంది. వీధుల్లో నడిచేందుకు గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పలు వీధులు బురదమయంగా మారగా, మరికొన్ని వీధుల్లో మురుగునీటి ప్రవాహం నిత్యకృత్యమైంది. వీధులలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి, కచ్చా డ్రైన్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



పెదశంకర్లపూడిలో ఎర్ర కాలువకు గండి పడటంతో నీట మునిగిన పంట పొలాలు

పల్లపు ప్రాంతాలు జలమయం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా బుధవారం కుండపోత వర్షం కురిసింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బెండపూడి శివారు తారాకరామ కాలనీలో వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఎ.కొత్తపల్లి, పైడికొండ, రావికంపాడు ఎస్సీ కాలనీ తదితర గ్రామాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఎస్ఎంసీ ఎన్నికలకు ఏర్పాట్లు

గండేపల్లి: మండలంలోని 41 పాఠశాలల్లో గురువారం నిర్వహించే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. ఇబ్బందికర వాతావరణం చోటు చేసుకోకుండా పోలీసుల సహకారంతో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు.

నేడు మండల సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో మండలాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు బుధవారం తెలిపారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా ఎ.కొత్తపల్లి దానవాయిపేట, కృష్ణాపురం, నర్శిపేట తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు, రైతులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బాలికల వసతి గృహంలో తనిఖీలు



ప్రత్తిపాడు హాస్టల్‌లో విద్యార్థినులకు సూచనలిస్తున్న న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను విద్యార్థులుసద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను సూచించారు. స్థానిక ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహాన్ని బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి హాస్టల్‌లో అందుతున్న వసతులపై ఆరా తీశారు. వారి ప్రతిభను పరీక్షించారు. చదువుతో పాటు ఇతర రంగాలలో రాణించాలని సూచించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యాపరంగా ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి ఎం.శైలజా రాణి, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



కత్తిపూడిలో సామూహిక సీమంతాలు చేస్తున్న సీడీపీఓ పద్మావతి

శంఖవరం: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్. పద్మావతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని కత్తిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకూ తల్లి పాలు మాత్రమే అందించాలన్నారు. రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు కొనసాగిస్తూ అదనపు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ముర్రిపాలు బిడ్డకు టీకా వంటివని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ బీవీ రజినీ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉపకరణాలకు లబ్ధిదారుల గుర్తింపు



ప్రత్తిపాడు ఉపకరణాల గుర్తింపు శిబిరంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న విభిన్న ప్రతిభావంతులు

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా అందించే ఉపకరణాల గుర్తింపు కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో దివ్యాంగులకు ఉపకరణాలు ఉచితంగా అందజేసేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ శిబిరానికి నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన సుమారు 600 మంది దివ్యాంగులు హాజరయ్యారని విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ పి.నారాయణమూర్తి తెలిపారు. హాజరైన దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి మండలాల ఎంపీడీఓలు ఎస్.డేవిడ్‌రాజ్, జె. శ్రీనివాస్, ఎం.ప్రేమసాగర్, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహకాలు



రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ప్రభుత్వం అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేటలో బుధవారం జిల్లా ఉద్యానవనశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను పంపిణీ చేసారు. జిల్లాఉద్యానవన అధికారి ఎస్.మల్లికార్జునరావు ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి ఎన్ఆర్‌జీఎస్ అనుసంధానంగా ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వివరించారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ తోటలు 15 వేల ఎకరాలలో విస్తరించాయని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డీజీఎం ప్రకాష్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వరప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, జగ్గంపేట ఉద్యానశాఖ అధికారి లావణ్య, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు చేనేత వృత్తి, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశంలో చేనేత పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. చేనేత పరిశ్రమ తోడ్పాటుకు అందరూ సహకారం అందించాలన్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ పీఓ ప్రయాగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, అధ్యాపకులు సురేష్, వెంకటేశ్వరరావు, రామారావు, శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

వరుస నాట్లతో అధిక దిగుబడులు



తాడు ఆధారంగా వరుస క్రమంలో నాట్లు వేయడాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారులు

తుని రూరల్: తాడు ఆధారంగా వేసే వరుస నాట్ల విధానంతో మేలైన దిగుబడులు సాధించవచ్చని రైతు శిక్షణా కేంద్రం సహాయ సంచాలకులు భ్రమరాంబ అన్నారు. మండలంలోని డి.పోలవరంలో బుధవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతు శిక్షణాకేంద్రం ఏడీఏ భ్రమరాంబ, తుని సబ్‌డివిజన్ ఏడీఏ సుంకర బుల్లిబాబు, ఏఓ బి.అశోక్ కుమార్ పాల్గొని రైతులకు వరినారు తయారీ, నారు తీత, చిగుర్లు కత్తిరింపు, తాడు కట్టి వరుస క్రమంలో నాట్లు వేయడంపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో పొలంబడి పనులు ఏ విధంగా చేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఏడీఏలు మాట్లాడుతూ ఖరీఫ్ సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. గట్లపై చామంతి మొక్కలు నాటితే మిత్ర పురుగులు చేరుతాయన్నారు. చామంతి మొక్కలపై ఉండే మిత్ర పురుగులు పంటపొలాన్ని ఆశించే శత్రుపురుగులను నాశనం చేస్తాయన్నారు. వరుస క్రమంలో నాట్లు వేయడం వల్ల పంటకు గాలి, వెలుతురు తగిలి పురుగులు, కీటకాల ఉధృతి తగ్గుతుందన్నారు. నీటిపారుదల వ్యవస్థ పటిష్టంగా ఉంటుందన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించకుండా వాడాలన్నారు. పురుగుల మందు పిచికారీ చేసే సమయంలో మాస్కులు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు లోవరాజు, శ్రీను, శ్రీనివాసు, శివాజీ, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



కిర్లంపూడి మండలం ముక్కొల్లులో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అమృత

కిర్లంపూడి: బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చని ఏఓ జోకా అమృత అన్నారు. మండలంలోని ముక్కొల్లులో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయు విధానాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ విత్తన శుద్ధితో రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. తెగుళ్ల ఉధృతి తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం స్థానికంగా వరి పంటలను పరిశీలించారు. పంటలకు మేలు చేసే మిత్ర పురుగుల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. శ్రీనివాస్, ఐసీఆర్‌పీ దువ్వాల శివ, బచ్చల అమృత తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు సారె సమర్పణ

గండేపల్లి: మండలంలోని మురారి, గండేపల్లి, మల్లేపల్లి, సుబ్బయమ్మపేట, కె. గోపాలపురం, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో వేంచేసిన గ్రామ దేవతలకు బుధవారం సారే సమర్పించారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవార్లకు చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

పోగొట్టుకున్న పర్స్ బాధితుడికి అందజేత

అన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్‌లో పర్స్ పోగొట్టుకున్న వ్యక్తికి బుధవారం రైల్వే పోలీసులు పర్స్ వెతికి అందజేశారు. వివరాల్లోకి వెళితే... తొండంగి మండలం పీఈ చిన్నాయపాలెం గ్రామానికి చెందిన పీతల చిన్నబాబు తన సోదరుడిని జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించేందుకు బుధవారం ఉదయం అన్నవరం రైల్వేస్టేషన్‌కు వచ్చారు. రైలు ఎక్కించిన తరువాత చూస్తే తన జేబులో పర్స్ కనిపించలేదు. ఆ పర్స్‌లో నగదు, ఏటీఎం కార్డు, ఇతర విలువైన కార్డులు ఉండడంతో ఆయన రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన తుని జీఆర్‌పీ ఎస్ఐ అబ్దుల్ మరూఫ్ ఆ పర్స్ వెతికి బాధితునికి అప్పగించాలని రైల్వే పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై పర్స్‌ను కనుకొని బాధితుడు చినబాబుకు అప్పగించినట్లు అన్నవరం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ త్రినాథ్ తెలిపారు.

ప్రజాసేవే రోటరీక్లబ్ లక్ష్యం



తుని ఏరియా ఆసుపత్రిలో గర్భిణికి రొట్టె అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

తుని: ప్రజా సేవే లక్ష్యంగా రోటరీక్లబ్ అడుగులు వేస్తోందని ఆ క్లబ్ సెంట్రల్ ప్రెసిడెంట్ చక్క శ్రీధర్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 100 మంది గర్భిణులు, బాలింతలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు దండెం కృష్ణ, వంగలపూడి బుజ్జి, దండెం రామకృష్ణ, కంకిపాటి జమీలు, ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.


అలరించిన నృత్య ప్రదర్శనలు



ఏలేశ్వరంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఏలేశ్వరం: పట్టణంలో విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. స్థానిక సీతారత్న లలితా కళా నృత్యనికేతన్ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరా ఫంక్షన్ హాలులో నాట్యాచారిణి ముళ్లపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఏలేశ్వరం, జగ్గంపేట, ధర్మవరం, కాత్రావులపల్లి గ్రామాలకు చెందిన 40 మంది చిన్నారులు తాము శిక్షణలో పొందిన నృత్యాలను ప్రదర్శించారు. ఈ నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. చివరగా వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ నృత్యరూపకం విశేషంగా అలంరించింది. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మున్సిపల్ కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువులు ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



లక్ష్మణుడుపేటలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ లక్ష్మణుడుపేటలో పేద బాధిత కుటుంబానికి స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు చేయూతనందించారు. గ్రామానికి చెందిన కాలిన సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. పేద కుటుంబం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు బుధవారం రూ.32 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.శ్రీనివాసరావు, శ్రీనుబాబు, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆకర్షించేలా బోధించాలి

సామర్లకోట: విద్యార్థులను ఆకర్షించే విధంగా విద్యా బోధన ఉండాలని స్కీమ్స్ ఎంఈఓ పి. పుల్లయ్య అన్నారు. బుధవారం స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో 462 మంది విద్యార్థులకు 455 హాజరు కావడంపై ఎంఈఓ హర్షం వ్యక్తం చేశారు.